

శివ.. శివా...

- భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

కామరాజర్‌పై డీఎంకే నేత వివాదాస్పద వ్యాఖ్యలు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిజాయితీ, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత కామరాజర్‌పై డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ తిరుచ్చి శివ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదమయ్యాయి. శివ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఈ నెల 15న పెరంబూరులో జరిగిన డీఎంకే సభలో తిరుచ్చి శివ ప్రసంగిస్తూ కామరాజర్ ఏసీ లేకుండా ఉండలేరని, చనిపోవటానికి ముందు కరుణానిధి చేతులు పట్టుకుని, రాష్ట్రాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ వేడుకున్నారన్నారు. తాను 23 యేళ్ల వయస్సులో ఉన్నప్పుడు కరుణానిధితో కారులో వెళ్తుండేవాడినని, ఆ సమయంలో రాష్ట్రానికి చెందిన నాయకుల సంగతులు కూడా చెప్పేవారని, ఆ ప్రకారమే ఓ రోజు ఇద్దరం కలిసి కారులో వెళ్తుండగా విద్యుత్‌కోతపై కామరాజర్ రాష్ట్రమంతటా నిరసన సభలు జరుపుతున్నారని, అయితే కామరాజర్‌కు ఏసీ లేకుంటే అలెర్జీ వస్తుందని, ఆ కారణంగానే ఆయన బసచేసే గెస్ట్‌హౌస్‌లకు ఏసీ సదుపాయం కల్పించాలని తాను ఆదేశించినట్టు కరుణానిధి చెప్పారని శివ పేర్కొన్నారు. అంతే కాకుండా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కామరాజర్ ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారని, ఆ సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసేందుకు కూడా సిద్ధమైందని, ఈ వివరాలన్నింటిని ఆయనకు తెలియజేసి, తమిళనాట ఉంటే కామరాజర్ అరెస్టు కాకుండా తాను కాపాడగలనని చెప్పినట్లు కరుణానిధి తనకు వివరించారని శివ తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వీడియోగా వెలువడంతో కాంగ్రెస్ కార్యకర్తలు తిరుచ్చి శివ వ్యాఖ్యలపై భగ్గున మండిపడ్డారు.

తిరుచ్చి శివ ఇంటి ముట్టడి యత్నం...

కామరాజర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తిరుచ్చి శివ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు గురువారం తిరుచ్చిలోని ఆయన నివాసగృహాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. మొదట టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది శరవణన్ నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు తిరుచ్చి శివాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో జరిపారు. ఆ తర్వాత తిరుచ్చి శివ ఇంటివైపుగా ర్యాలీ జరిపారు. పోలీసులు మధ్యలోనే వారిని అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో శివాజీ పేరవై అధ్యక్షుడు శివాజీ షణ్ముగం, తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుచ్చిలో ఎంపీ శివ నివాసం ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నేతలు

అవన్నీ కట్టుకథలు: టీఎన్‌సీసీ

డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ వ్యాఖ్యలపై టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై స్పందిస్తూ ఆధారాలు లేకుండా కామరాజర్ కీర్తి ప్రతిష్టలను దిగజార్చేలా విమర్శించటం గర్హనీయమన్నారు. కామరాజర్ గురించి మాట్లాడే అర్హత ఎవరికీ లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ డీఎంకే చేసిన దుష్ప్రచారం వల్లే ఎన్నికల్లో కామరాజర్ ఓడిపోయారనే విషయం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. వాస్తవానికి ప్రభుత్వ అతిథిగృహంలో వేడిగా ఉందంటూ కామరాజర్ చెట్టునీడలో ఇద్దరు తువ్వాలు పరచుకుని నిద్రపోయేవారని ఆమె తెలిపారు.ఏసీ లేకుండా కామరాజర్ నిద్రపోరని తిరుచ్చి శివ చెప్పినదంతా అసత్యమన్నారు.గతంలో కామరాజర్‌పై డీఎంకే నేతలు అల్లిన కట్టుకథల కొనసాగింపే తిరుచ్చి శివ విమర్శలని జ్యోతిమణి పేర్కొన్నారు. నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ వ్యాఖ్యానిస్తూ 'డీఎంకేకు ఓటు వేయడం,దొంగను ఇంటికి రమ్మని ఆహ్వానించడం లాంటిదని చెప్పిన కామరాజర్ అంత్యకాలంలో కరుణానిధి చేతులుపట్టుకుని నీవే దేశాన్ని కాపాడాలని వేడుకున్నారని చెబుతుండటం అభూత కల్పనే అని విమర్శించారు.ఇదే విధంగా తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి తదితరులు కూడా ఎంపీ శివ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడటంతో తిరుచ్చి శివ స్పందించారు. కామరాజర్ జయంతి సందర్భంగా పెరంబూరు సభలో గతంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తనతో చెప్పిన మాటలనే తాను గుర్తుచేశానని,ఆయన కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించడం తన ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు.

నోరు జారొద్దు..! వివాదం చేయొద్దు!

డీఎంకే శ్రేణులకు స్టాలిన్ హితవు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్‌పై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడి అనవసరమైన వివాదాలను సృష్టించవద్దంటూ పార్టీ శ్రేణులకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హితవు పలికారు. ఈ మేరకు గురువారం స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో ఓ ప్రకటన విడుదల చేస్తూ .. పార్టీ శ్రేణులు కలహాలతో పార్టీలో మంటపుట్టించి చలికాచుకోవాలనుకునేవారికి చోటివ్వవద్దని, కామరాజర్‌ను 'శ్రేష్ఠమైన తమిళుడు' అని పెరియార్ కీర్తించేవారని, గుడియాత్తంలో కామరాజర్ పోటీ చేసినప్పుడు ఆయనకు వ్యతిరేకంగా డీఎంకే అభ్యర్థిని పెట్టకూడదని అన్నాదురై నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ఇక మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి మహానేత కామరాజర్ మృతిచెందినప్పుడు కుమారుడిలా దగ్గరుండి అంత్యక్రియలు జరిపారని, అంతే కాకుండా ఆయనకు స్మారకమందిరం నిర్మించి, ఆయన జయంతిని విద్యాభివృద్ధి దినంగా జరుపుకునేలా ఉత్తర్వులిచ్చారని వివరించారు. తన వివాహానికి ఆరోగ్యం సహకరించకపోయినా కామరాజర్ హాజరై ఆశీర్వదించడాన్ని తానెన్నటికీ మరువలేనని స్టాలిన్ పేర్కొన్నారు. ఇంతటి ఘనకీర్తిని సంతరించుకున్న మహానేత గురించి బహిరంగ ప్రదేశాల్లో చర్చనీయాంశమైన వ్యాఖ్యలు చేయడం, వాటిపై వివాదం చేయడం సమంజసం కాదని, ఆ మహాపురుషుడి కీర్తికి భంగం కలిగించే ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేయకుండా సంయమనం పాటించాలని స్టాలిన్ హితవు పలికారు. 'తన జీవితపర్యంతమూ సామాజిక న్యాయం కోసం మతసామరస్యం కోసం పాటుపడినా ఆ మహానేత ఆశయాలను నెరవేర్చేందుకు అందరం సమష్టిగా పాటుపడుదాం. వివాదాలను విడిచిపెడదాం' అంటూ స్టాలిన్ పిలుపునిచ్చారు.





జిల్లా కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

నెలరోజుల్లో 2.5 కోట్ల సభ్యత్వం...

నెలరోజుల్లో 2.5 కోట్ల మందికి డీఎంకే సభ్యత్వం కల్పించాలని, ఆ దిశగా జిల్లా కార్యదర్శులు తగు చర్యలు చేపట్టాలని ఆ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయం నుండి గురువారం ఉదయం జిల్లా కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 68 పోలింగ్ కేంద్రాలలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్ డిజిటల్ ఏజెంట్లు పార్టీకి వెలగట్టలేని ఆస్తులన్నారు. వీరందరిని అసెంబ్లీ ఎన్నికల్లో సద్వినియోగపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని చోట్ల సభ్యత్వ కార్యక్రమాలను సక్రమంగా జరపటం లేదని, నకిలీ సభ్యత్వం కల్పిస్తున్నారని తనకు రహస్య సమాచారం అందిందని, అలాంటి వారిపై పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.ఇక బీజేపీ, అన్నాడీఎంకే నేతలు సాగిస్తున్న అవినీతి అక్రమాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించేరీతిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కూడా పిలుపునిచ్చారు.

- కాంగ్రెస్‌కు అన్నామలై సూచన
- బేషరతు క్షమాపణ చెప్పాలి
- తమిళిసై, జీకే వాసన్ డిమాండ్

గౌరవం కోసమైనా ఆ కూటమి నుంచి తప్పుకోండి



తమిళిసై



అన్నామలై

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు ఊపిరిలూదిన కామరాజర్‌ను డీఎంకే నేతలు అవమానించినందుకు నిరసనగా, కనీస గౌరవం కోసమైనా ఆ కూటమి నుంచి వైదొలగాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై సూచించారు. నగరంలో గురువారం అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... సమర్థవంతమైన పాలకుడు కామరాజర్ ఓటమికి డీఎంకే ప్రధాన కారణమన్నారు. 1967 ఎన్నికల్లో కామరాజర్‌ను ఓడించేందుకు డీఎంకే ఎన్నో అబద్ధాలు చెప్పిందన్నారు. అనంతరం కాంగ్రెస్ రెండుగా చీలిన సమయంలో, ఆ పార్టీని నిరోధించేందుకు డీఎంకే, ఇందిరాగాంధీతో ఎలా పనిచేసిందో 1971 ఎన్నికలు ఉదాహరణ అన్నారు. కామరాజర్ గురించి మాట్లాడేందుకు డీఎంకేకు అర్హత లేదన్నారు. 1967 ఎన్నిక సమయంలో కరుణానిధి మాటలు, అన్ని విషయాలు బయటకు తీసి చూపితే, గౌరవం ఉన్న ఒక్క కాంగ్రెస్ నేత కూడా డీఎంకే కూటమిలో ఉండలేరన్నారు. చివరి వరకు ఆస్తులు కూడబెట్టని సాధారణ వ్యక్తి కామరాజర్ అని, డీఎంకే, అన్నాడీఎంకేలు ఒకే పాత్రలో ఊరిన మామిడి టెంకలని కామరాజర్ చెప్పారని గుర్తుచేశారు. చరిత్రను వక్రీకరించి మాట్లాడిన డీఎంకే నేత తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని, ఇలాంటి మాటలు విన్న తరువాత కూడా కాంగ్రెస్ ఎలా మౌనంగా ఉండగలుగుతోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపడుతుందని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారని, ఆయన మాటలే తమకు వేదవాక్కు అని స్పష్టం చేశారు. అన్నాడీఎంకేకు ఏవైనా అభ్యంతరాలుంటే అమిత్ షాతో మాట్లాడుకోవాలని అన్నామలై సూచించారు.

నిరాడంబర శిఖరంపై విమర్శలా...?

నిరాడంబరంగా జీవించిన కామరాజర్‌ను డీఎంకే నేత విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఎంపీ తిరుచ్చి శివ బేషరతు క్షమాపణ చెప్పాలని బీజేపీ సీనియర్ నేత తమిళిసై, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు.



పార్టీలో చేరిన వారితో ఎడప్పాడి పళనిస్వామి

ప్రజా సేవలో అన్నాడీఎంకేదే

అగ్రస్థానం

- చిదంబరంలో ఈపీఎస్

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ప్రజలకు సేవ చేయడంలో అన్నాడీఎంకేదే అగ్రస్థానమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరునున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ ఈ నెల 7న ప్రారంభించిన ప్రచార యాత్ర గురువారం కడలూరు జిల్లాలోని చిదంబరం, కాట్టుమన్నార్‌కోవిల్, భువనగిరి నియోజకవర్గాల్లో సాగింది. చిదంబరం అన్నామలైనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో గురువారం ఉదయం ఈపీఎస్ సమక్షంలో డీఎంకే, డీపీఐ, ఏఎంఎంకే, సీపీఐ, డీఎండీకే, ఎండీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ కట్చి, తదితర రాజకీయ పార్టీల నుంచి సుమారు 2000 మంది అన్నాడీఎంకేలో చేరారు. ఈ కార్యక్రమంలో చిదంబరం ఎమ్మెల్యే పాండియన్, భువనగిరి ఎమ్మెల్యే అరుణ్ మొళిదేవన్, మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు. అన్నాడీఎంకేలో చేరినవారికి పార్టీ కండువా కప్పి ఈపీఎస్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూ ఆ పార్టీనుంచి వైదొలిగిన ఎంజీఆర్ 1972లో స్థాపించిన అన్నాడీఎంకేకు రాష్ట్రప్రజానీకం మద్దతుగా బ్రహ్మరథం పట్టిందన్నారు. రాష్ట్రాన్ని 30యేళ్ళకు పైగా పరిపాలించిన అన్నాడీఎంకే ప్రజలకు సేవ చేయడంలో మిగతా పార్టీల కంటే ముందంజలో ఉందని, ఇందులో కార్యకర్తల పాత్ర కూడా ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడేవారికి గుర్తింపు తప్పకుండా ఉంటుందని ఈపీఎస్ హామీ ఇచ్చారు. దివంగత మాజీముఖ్యమంత్రి కామరాజర్ గురించి డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ చేసిన వ్యాఖ్యలను ఈపీఎస్ ఖండించారు. పేద కుటుంబాల పిల్లలను విద్యావంతులుగా తీర్చి దిద్ది నిరాడంబరంగా జీవించిన గొప్పవ్యక్తి కామరాజర్ అని, ఆ మహానుభావుని పేరు ప్రఖ్యాతులకు కలంకం తీసుకొచ్చే విధంగా మాట్లాడిన తిరుచ్చి శివపై డీఎంకే అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రపంచం ఉన్నంత కాలం కర్మయోగి కామరాజర్ జీవించే ఉంటారని ఈపీఎస్ కొనియాడారు.

రక్తమోడిన రోడ్లు

రెండు ప్రమాదాల్లో ఆరుగురి దుర్మరణం

పొల్లాచ్చి సమీపంలో ముగ్గురు.. అరక్కోణం వద్ద మరో ముగ్గురు

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి వద్ద వ్యాను బోల్తా పడి ముగ్గురు మృతి చెందగా, రాణిపేట జిల్లా అరక్కోణం వద్ద లారీ-కారు ఢీకొని మరో ముగ్గురు అశువులు బాశారు. వివరాలిలా వున్నాయి...

పొల్లాచ్చి సమీపంలో నవమలై గిరిజన గ్రామానికి చెందినవారు పలు గ్రామాలకు వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. అందులో భాగంగా గురువారం ఉదయం ఆ గ్రామానికి చెందిన 20 మందికి పైగా కట్టంపట్టి వద్ద సాగు పనులకు ఓ లోడు వాహనంలో బయలుదేరారు. దేవబాలు నడిపిన ఆ వాహనం ఆలియార్ సమీపంలోని చిన్నార్పతి కొండమార్గం మలుపులో అదుపుతప్పి బోల్తాపడింది. వాహనంలో ప్రయాణించిన 20 మందికి గాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళుతున్నవారు ప్రమాదంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంలో మరణించిన నవమలైకు చెందిన రాణి, తిలకరాజ్, మరో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో పొల్లాచ్చి, కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. కూలీ పనులకు వెళ్తూ ప్రమాదంలో చిక్కుకుని ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృత్యు ఒడికి చేరుకోవడం స్థానికులను కంటతడి పెట్టించింది.



ఆలియార్ వద్ద కూలీలతో వెళ్తూ ప్రమాదానికి గురైన లగేజీ వాహనం

అరక్కోణం వద్ద ప్రమాదం...

రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని హైరోడ్డుపై ట్యాంకర్ లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెంకటేశన్ (55)అనే కారు మెకానిక్ తన భార్య, 19యేళ్ళ కుమారుడితో కలిసి ఆలయానికి వెళ్ళి కారులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ట్యాంకర్ ల్యారీని ఢీకొనడంతో వెంకటేశన్, అతని భార్య అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన వెంకటేశన్ కుమారుడు కూడా చికిత్స ఫలించక గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టి.నగర్‌లో రూ.254 కోట్లతో

ఐదంతస్తుల బస్ టెర్మినల్

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో వాణిజ్య కేంద్రమైన టి.నగర్ ప్రాంతంలో రూ.254 కోట్లతో ఐదంతస్తుల బస్ టెర్మినల్‌ను నిర్మించేందుకు చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ (సీఎండీఏ) సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన నమూనాను గురువారం విడుదల చేసింది. టి.నగర్ ప్రాంతంలో వస్త్రదుకాణాలు, జ్యూవెలరీ షాపులు, అనేక పరిశ్రమల దుకాణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఇందువల్ల నగరం నలుమూలల నుంచే కాకుండా శివారు ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైన వస్తువుల కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ ఇక్కడికి వచ్చివెళ్తుంటారు. టి.నగర్‌లోని ఎంటీసీ బస్‌స్టేషన్‌లో అనువైన స్థలం లేక కొన్ని బస్సులను బయటే రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలపై దృష్టి సారించిన సీఎండీఏ ఆధునిక వసతులతో టి.నగర్‌లోని బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఐదంతస్తులతో కొత్త బస్ టెర్మినల్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సుమారు 1.97 ఎకరాల విస్తీర్ణంలో రూ.254 కోట్లతో ఐదంతస్తులతో నిర్మించే బస్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఇక్కడినుంచి ప్రతిరోజు 300లకు పైగా ఎంటీసీ బస్సులు, 100కు పైగా చిన్న బస్సులను నడుపవచ్చు. కింది అంతస్థులో బస్సులు నిలిపేందుకు వసతులు సమకూర్చనున్నారు. పై అంతస్థులో దుకాణాలు, కార్యాలయాలు, ఆస్పత్రులు, ఫుడ్‌కోర్టులు, పిల్లల సంరక్షణ కేంద్రాలు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఆధునిక టాయిలెట్లు ఏర్పాటు కానున్నాయి. ఈ బస్ టెర్మినల్‌లో ఒకే సమయంలో 97 బస్సులు, 945 కార్లు, 87 ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసేలా సదుపాయం కల్పించనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం కింది అంతస్తులో టికెట్ కౌంటర్లు, సమాచార కేంద్రం, బస్సులు వెళ్ళే రూట్లు తదితర వసతులు సమకూర్చనున్నారు. ఈ కొత్త బస్ టెర్మినల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన అనంతరం వాణిజ్యం, వాహనాల పార్కింగ్ ద్వారా ఐదేళ్ళలో రూ.2,950 కోట్ల ఆదాయం వస్తుందని, ముఖ్యంగా ఎంటీసీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు సేదతీరేందుకు ప్రత్యేక గదులు, వారికి వైద్యపరీక్షల నిమిత్తం క్లినిక్ తదితర వసతులు కల్పించనున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు.



కొత్తగా నిర్మించే బస్ టెర్మినల్ నమూనా

నీలగిరిలో కుండపోత



6

ముక్తిని ప్రసాదించే మయిలమ్ ఆలయం



7

విపత్తుల నివారణ చర్యలపై పోలీసులకు శిక్షణ

ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో విక్రమ్ కొత్త సినిమా

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పోరూర్: వైర్‌లెస్ స్టేషన్ రోడ్డు, ఆర్‌ఈ నగర్ 5వ వీధి, జయభారతి నగర్, రామకృష్ణ నగర్ 1 నుంచి 7 అవెన్యూ, రమ్య నగర్, ఉదయ నగర్, గురుస్వామి నగర్, రాజేశ్వరి నగర్, సంతోష్ నగర్, గోవిందరాజ్ నగర్, కావ్య గార్డన్, రామస్వామి నగర్

బీసెంట్ నగర్: గంగై వీధి, అప్పర్ వీధి, అరున్‌డేల్ బీచ్ రోడ్డు, టైగర్ వరదాచారి రోడ్డు కోస్టల్ రోడ్డు, తిరుమురుగన్ వీధి, కావేరి వీధి, తిడీర్ నగర్, వైగై వీధి, రుక్మిణి రోడ్డు ఎక్స్‌టెన్షన్, ఓడికుప్పం, అష్టలక్ష్మి గార్డన్, పారి వీధి, పయందిఅమ్మన్ ఆలయ వీధి, కుంబర్ వీధి

యోగా, ప్రకృతి వైద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): యోగా, ప్రకృతి వైద్య కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల ఆగస్టు 1వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదున్నరేళ్ల ఈ కోర్సుకు ప్లస్ టూ మార్కుల ఆధారంగా అడ్మిషన్ కల్పించనున్నారు. రెండు ప్రభుత్వ యోగా, ప్రకృతి వైద్య కళాశాలలు, 17 ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.tnhealth.tn.gov.in, www.tnayushselection.org అనే వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు స్థానిక అరుంబాక్కంలోని అరింజర్ అన్నా సిద్ధ ఆసుపత్రి ప్రాంగణంలోని కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ప్రకటన వెలువడింది.

22న యూజీసీ నెట్ ఫలితాలు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 'నెట్' ఫలితాలు ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు జాతీయ పరీక్షా ఏజెన్సీ ఒక ప్రకటనలో తెలిపింది. పీజీ వైద్య కోర్సుల అడ్మిషన్లకు జూన్‌లో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహించారు.

తపాలా కార్యాలయాల్లో ఒక రోజు సేవలకు అంతరాయం

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరచనున్న నేపథ్యంలో, దక్షిణ చెన్నై డివిజన్ పరిధిలోని 47 తపాలా కార్యాలయాలు ఆగస్టు 4వ తేది పనిచేయవని భారత తపాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. తపాలా శాఖలో డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆగస్టు 5వ తేది నుంచి అందుబాటులోకి రానుంది. ఈ పరిజ్ఞానం ట్రయల్‌రన్ 4వ తేది నిర్వహించనున్న కారణంగా, ఆ రోజున దక్షిణ చెన్నై డివిజన్ పరిధిలోని 47 తపాలా కార్యాలయాలు పనిచేయవని, ఆ రోజున ఈ కార్యాలయాల్లో ఎలాంటి లావాదేవీలు ఉండవని తపాలా శాఖ తెలియజేసింది.

20న కాంచీపురం జిల్లా నేతలతో ఓపీఎస్ సమావేశం

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా నేతలతో మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ఈ నెల 20న సమావేశం కానున్నారు. అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ పేరుతో ఓపీఎస్ అన్ని జిల్లాల్లోని మద్దతుదారులతో సమావేశమై చర్చించాలని ఆయన నిర్ణయించారు. అందులో భాగంగా, మొదటిగా కాంచీపురం జిల్లా నేతలతో ఈ నెల 20వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఈపీఎస్ సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి వైద్యలింగం, ఎమ్మెల్యే మనోజ్‌పాండ్యన్, జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొంటారని ఈపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో భవనాల నిర్మాణాలకు రూ.130 కోట్లు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో అదనపు భవనాల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.130 కోట్లు కేటాయించింది. శాసనసభలో ప్రకటించిన మేరకు, తొలివిడతగా రూ.130 కోట్లు కేటాయించి, కోవై, దిండుగల్, కన్నియాకుమారి, కరూర్, తంజావూరు, తిరువారూర్ తదితర జిల్లాల్లోని 45 ప్రభుత్వాసుపత్రుల్లో అదనపు భవనాల నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

ల్యాప్‌టాప్‌ల సరఫరాకు మూడు సంస్థల టెండర్లు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించే ప్రాజెక్ట్ కోసం మూడు సంస్థలు టెండర్లు వేశాయి. 20 లక్షల ల్యాప్‌టాప్‌లు అందించేందుకు ఏసర్, డెల్, హెచ్‌పీ సంస్థలు టెండర్ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. సాంకేతిక బిడ్ పరిశీలించి కాంట్రాక్ట్ పాయింట్లు ఖరారు చేయనున్నారు. అధిక పాయింట్లు సాధించిన సంస్థలకు ల్యాప్‌టాప్ కాంట్రాక్ట్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటుందని అధికారులు తెలిపారు.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవులను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర వ్యాప్తంగా 1,035 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ ప్రాంతాలకు శుక్రవారం 355, శనివారం 350 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాధవరం నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై నుంచి పలు ప్రాంతాల కు 200 ప్రత్యేక బస్సులు నడుపనుండగా, సెలవుల తరువాత తిరిగొచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలిపింది.

అల్పాహారం తీసుకున్న విద్యార్థులకు అస్వస్థత

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల హాస్టల్‌లో ఆహారం తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నీలగిరి జిల్లా కూడలూరు సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ పాఠశాలలో 90 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో 33 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల హాస్టల్‌లో ఉంటున్నారు. గురువారం ఉదయం విద్యార్థులు అల్పాహారం తీసుకున్న కొద్ది నిమిషాల్లోనే వాంతులు చేసుకుని స్పృహతప్పి పడిపోయారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన ఉపాధ్యాయులు వారిని కూడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విపత్తుల నివారణ చర్యలపై పోలీసులకు శిక్షణ




భవనంపై చిక్కుకున్న వారిని రక్షిస్తున్న దృశ్యం - శిక్షణలో పాల్గొన్న పోలీసులు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పోలీసుల ఆధ్వర్యంలో విపత్తుల నివారణ, రక్షణ చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎగ్మూర్‌లోని రాజారత్నం స్టేడియంలో గురువారం ఉదయం పోలీసు కమిషనర్ పర్యవేక్షణలో ఈ మాక్ డ్రిల్ సాగింది. ఈ కార్యక్రమంలో విపత్తుల నివారణ, రక్షణ చర్యలకు నియమించిన 16 బృందాలకు చెందిన 290 మంది పోలీసులు పాల్గొన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని రబ్బరు బోట్ల ద్వారా రక్షించడం, ప్రమాద సమయాల్లో భవనాల్లో చిక్కుకున్న వారిని రక్షించి, ప్రాథమిక చికిత్స అందించడం తదితరాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అలాగే, విపత్తుల నివారణ చర్యల్లో పోర్టబుల్ జనరేటర్లు, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, తాత్కాలిక టెంట్లు వేయడం సహా పలు సహాయక పరికరాల తీరును వివరించడంతో పాటు వాటిని ఎలా వినియోగించేలా చేసి చూపినట్లు అడిషనల్ కమిషనర్ విజయేంద్ర బిడారి తెలిపారు.

కీళడి నివేదికలో మార్పులు తగవు

● పురావస్తు పరిశోధకులు అమర్‌నాథ్



అమర్‌నాథ్ రామకృష్ణ

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమిళులకు చిరునామాగా ఉన్న కీళడి పురావస్తు పరిశోధన నివేదికలో మార్పులు చేయడం నేరమని జాతీయ పురావస్తు స్మారక చిహ్నాల డైరెక్టర్ అమర్‌నాథ్ రామకృష్ణ స్పష్టం చేశారు. శివగంగ జిల్లాలో వైగైనది తీరంలోని కీళడి గ్రామం పురావస్తు పరిశోధనలకు ప్రసిద్ధి. ఇక్కడభారత పురావస్తు పరిశోధన కేంద్రం (ఏఎస్ఐ) ఉంది. రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పరిశోధనలు, పురాతన కాలంనాటి సంస్కృతి, నాగరికత, తవ్వకాల్లో బయల్పడుతున్న కళాఖండాలను పరిశీలించి నివేదిక తయారుచేస్తుంది. ఆ రీతిలో 2014 నుంచి 2016 వరకు కీళడి ప్రాంతంలో చేపట్టిన తవ్వకాల్లో పురాతన శిథిలాలు, ఆది మానవులు ఉపయోగించిన మట్టిపాత్రలు, పనిముట్లు తదితరాలు లభ్యమయ్యాయి. వీటిపై అమర్‌నాథ్ రామకృష్ణ అందజేసిన 982 పేజీల కీళడి నివేదికను సవరించేందుకు కేంద్రప్రభుత్వం కోరడం చర్చనీయాంశమైంది. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, పురాతనకాలం నాటి కళాఖండాలు లభ్యంకావడం ద్వారా తమిళులకు చిరునామాగా ఉన్న కీళడి నివేదికలో కేంద్ర ప్రభుత్వం సవరించాలనుకోవడం క్రిమినల్ నేరంలాంటిదని వ్యాఖ్యానించారు.

జెండా రంగుల వినియోగంపై నిషేధం

● టీవీకే అధ్యక్షుడికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ పతాకంలో ఎరుపు, పసుపు, ప్రత్యేక రంగుల వినియోగంపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై, అఫిడవిట్ దాఖలుచేయాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది.తొండై మండల సన్నార్ ధర్మ పరిపాలనసభ అధ్యక్షుడు పచ్చయప్పన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... తొండై మండల సన్నార్ ధర్మ పరిపాలన సభ తమిళనాడు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విభాగంలో నమోదుచేసి ట్రస్ట్‌గా పనిచేస్తుందన్నారు. ఈ సభ జెండాను ఎరుపు, పసుపు రంగులతో రూపొందించామన్నారు.నిర్దిష్ట రంగులు వినియోగించే హక్కు తమ సభకు మాత్రమే ఉందన్నారు. కానీ, నటుడు విజయ్ 2024లో ప్రారంభించిన టీవీకే జెండాలో ఎరుపు, పసుపు రంగులున్నాయని, అందువల్ల టీవీకే జెండాలోని రంగులు తొలగించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ గురువారం విచారించిన హైకోర్టు న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ రామమూర్తి... ట్రేడ్ మార్క్ సర్టిఫికెట్ సరుకులకు మాత్రమే వర్తిస్తుంది, రాజకీయ పార్టీల జెండాలకు ఎలా వర్తిస్తుంది? అని ప్రశ్నించారు. ట్రేడ్ మార్క్ సర్టిఫికెట్ సరుకులకు మాత్రమే కాకుండా సేవలకు వర్తిస్తుందని, స్వచ్ఛంద సంస్థలు, ట్రస్ట్‌లకు కూడా ఈ సర్టిఫికెట్ వర్తిస్తుందని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. అనంతరం న్యాయమూర్తి, ఈ పిటిషన్‌పై టీవీకే అధ్యక్షుడు విజయ్ అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, విచారణ వాయిదావేశారు.

డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కిన పార్ట్‌టైమ్ టీచర్ల అరెస్టు



రాస్తారోకోలో పాల్గొన్న పార్ట్‌టైమ్ టీచర్లు

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు ప్రభుత్వ కళాశాల సమీపంలో గురువారం విధులు బహిష్కరించి తమ డిమాండ్ల సాధన కోసం రాస్తారోకో చేసిన 150 మందికి పైగా పార్ట్‌టైమ్ టీచర్లను పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడు ప్రాథమిక విద్య టీచర్ల సంఘాల సమాఖ్య జాయింట్ యాక్షన్ కమిటీ (టిటోజాక్) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి ధీటుగా పార్ట్‌టైమ్ టీచర్లకు వేతనం ఇవ్వాలి, పాత పింఛన్ విధానం అమలు పరచాలి, డీఎంకే ఎన్నికల హామీలను నెరవేర్చాలి తదితర డిమాండ్లతో జిల్లాస్థాయిలో ఈ నెల 16, 17, 18వ తేదీల్లో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు గురువారం ఉదయం తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రాంగణంలో రోడ్డుపై బైటాయించిన పార్ట్‌టైమ్ టీచర్లు పెండింగులో డిమాండ్లను పరిష్కరించాలని, జీవో నెంబరు 234ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. చెన్నై-తిరువళ్లూరు-తిరుపతి ప్రధాన రహదారిలో చేపట్టిన రాస్తారోకో వల్ల ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.. దీంతో పోలీసులు మహిళలు సహా 150 మందిని అరెస్టు చేసి ఓ ప్రైవేటు కల్యాణ మండపానికి తరలించారు. అదేవిధంగా పెరంబలూరు, సింగంపునారి తదితర ప్రాంతాల్లో విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్న మరో 200 మందికి పైగా పార్ట్‌టైమ్ టీచర్లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కులంపేరుతో ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుంటే కేసు

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కులంపేరుతో ఆలయ ప్రవేశాన్ని అడ్డుకున్నవారిపై కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసుశాఖకు మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అరియలూరు జిల్లా అయ్యనార్ ఆలయంలో దళితులు ఆలయంలోకి వెళ్లేందుకు అనుమతించడంలేదని వెంకటేశన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో అరియలూరు జిల్లా ఉడలయార్ పాళయం గ్రామంలో ఉన్న అయ్యనార్ ఆలయంలో దళిత వర్గాలకు చెందిన భక్తులు ప్రతిష్ఠించిన విగ్రహాలను ఓ వర్గానికి చెందినవారు కూల్చివేశారని, ఆలయంలో స్వామివారి దర్శనానికి దళితులను అనుమతించడంలేదని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ గ్రామంలో బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రధానాంశమైన రథోత్సవంలో పాల్గొనకూడదంటూ దళితులకు నిబంధన విధించారని, దీనిపై విచారణ జరిపి తమకు ఆలయ ప్రవేశం కల్పించాల్సిందిగా వెంకటేశన్ న్యాయస్థానానికి విజ్ఞప్తిచేశారు. గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ నేతృత్వంలోని బెంచ్ ముందు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. చట్టప్రకారం ప్రభుత్వాలున్న ప్రజాస్వామ్య దేశంలో ఆలయంలో ప్రవేశించేందుకు ప్రతిపౌరుడికి హక్కుందని పలు ఉద్యమాల తర్వాతే ఎస్సీ ఎస్టీ వర్గాల ఆలయ ప్రవేశానికి చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ చట్టాన్ని తప్పకుండా పాటించాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తుచేసిన న్యాయమూర్తి, పిటిషనర్ కోరికపై పరిశీలించి దళితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అరియలూరు జిల్లా ఎస్పీకి, ఆలయ అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు.

● పాఠశాల వ్యాన్ ప్రమాదం...

రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్‌ఆర్సీ నోటీసు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల వాహనం ప్రమాదానికి గురైన వ్యవహారాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) సుమోటా కేసుగా నమోదుచేసి విచారణ చేపట్టింది. ఈ నెల 8వ తేది కడలూరు జిల్లా సెమ్మకుప్పం ప్రాంతంలోని రైల్వే గేటును పాఠశాల వ్యాన్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొని ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. గేటు మూయకపోవడమే దీనికి కారణమని ప్రాథమిక విచారణలో నిర్ధారించిన రైల్వే శాఖ, గేట్ కీపర్‌ను డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో, సంబంధిత రైల్వే గేటు ప్రాంతంలో సబ్ వే ఏర్పాటుకు నిధులతో పాటు అనుమతులు మంజూరయ్యాయని, కానీ, జిల్లా కలెక్టర్ ఏడాది కాలంగా దానిని పెండింగ్‌లో ఉంచారని దక్షిణ రైల్వే తరఫున ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, కడలూరు పాఠశాల వ్యాన్ ప్రమాదంపై పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటో కేసుగా విచారించింది. ఈ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ, రైల్వే బోర్డు అధ్యక్షుడు, రైల్వే మంత్రిత్వ శాఖ రెండు వారాల్లో సమగ్ర నివేదిక దాఖలు చేయాలని నోటీసు జారీచేసింది.

కోయంబేడులో ఎక్స్‌ప్రెస్ బస్సు జప్తు



కోర్టు సిబ్బంది జప్తు చేసుకోవడంతో బస్సులో నుంచి దిగిన ప్రయాణికులు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ బస్సులో కండెక్టర్ సస్పెన్షన్ కాలంలో చెల్లించాల్సిన రూ.11 లక్షల వేతన, భత్యం తదితర బకాయిలను చెల్లించకపోవడంతో కోయంబేడు బస్‌స్టేషన్‌లో బెంగళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సును కోర్టు సిబ్బంది జప్తు చేసుకున్నారు. మైలాడుదురైకి చెందిన పన్నీర్‌సెల్వం అనే కండెక్టర్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ తర్వాత కోర్టు తీర్పు ద్వారా మళ్లీ కండెక్టర్‌గా చేరాడు ఆ నేపథ్యంలో తన సస్పెన్షన్ కాలంలో చెల్లించాల్సిన రూ.11 లక్షల బకాయిల కోసం హైకోర్టు ఆశ్రయించాడు. వెంటనే బకాయి చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. నెలలు గడిచినా అతడికి రవాణా సంస్థ బకాయిలు చెల్లించకపోవడంతో పన్నీర్‌సెల్వం హైకోర్టులో కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన పిటిషన్ వేశాడు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సును జప్తు చేయాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు కోర్టు సిబ్బంది కోయంబేడుకు వెళ్లి బెంగళూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సును జప్తు చేసుకున్నారు. దీంతో బెంగళూరుకు వెళ్లాల్సిన ప్రయాణికులను కిందకు దించివేశారు.

తాను చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా...



పత్తుకాని పాఠశాల హెచ్‌ఎం షీలా

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులైన గిరిజన యువతిని స్థానికులు, రాజకీయ నేతలు ప్రశంసలతో ముంచెత్తారు. కన్నియాకుమారి జిల్లా కలియల్ సమీపంలో పేను ప్రాంతానికి చెందిన షీలా అక్కడి పత్తుకాని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూలులో పాఠశాల విద్య పూర్తి చేసుకుని, ఉపాధ్యాయ శిక్షణ ముగించుకుని వట్టపారై పాఠశాలలో టీచర్‌గా సేవలందించారు. ఈ నేపథ్యంలో ఇటీవల షీలా చదివిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఆమెను ప్రభుత్వం నియమించింది. పత్తుకాని ప్రభుత్వ రెసిడెన్షియల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన షీలాను స్థానికులు, గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు ప్రశంసతో ముంచెత్తారు.

● జెండా స్తంభాల వ్యవహారం..

త్రిసభ్య ధర్మాసనానికి సీపీఎం కేసు బదిలీ

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జెండా స్తంభాలు తొలగించాలనే సింగిల్ జడ్జి తీర్పును వ్యతిరేకిస్తూ సీపీఎం దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ విచారణ ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రద్దీ ప్రాంతాలు, జాతీయ, రాష్ట్ర రహదారులు, స్థానిక సంస్థల స్థలాల్లో అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన రాజకీయ పార్టీలు, కుల, మత సంఘాల జెండా స్తంభాలు తొలగించాలంటూ హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి జీకే ఇళంధిరయన్ ఉత్తర్వులు జారీచేశారు. దానిని న్యాయమూర్తి జె.నిషాభాను నేతృత్వంలోని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం సమర్థించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసులో తమ వాదనలు వినాలని కోరుతూ సీపీఎం తరఫున అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ నేతృత్వంలోని ధర్మాసనం, ఈ అప్పీలు పిటిషన్ విచారణ ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రధాన న్యాయమూర్తికి సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో, మద్రాసు హైకోర్టులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం దాఖలుచేసిన పిటిషన్‌లో... హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం, జిల్లా కలెక్టర్లు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా, రాష్ట్ర వ్యాప్తంగా జెండా స్తంభాల తొలగింపు చేపట్టారని, జెండా స్తంభాలు తొలగించాలనే సింగ్ జడ్జి తీర్పుపై దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ విచారణలో ఉందన్నారు. ఈ క్రమంలో, ఈ నెల 18వ తేదిలోగా అన్ని జెండా స్తంభాలు తొలగించాలని జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి 15వ తేది సర్క్యులర్ పంపారని, ఇది చట్టవ్యతిరేకమని, ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేశన్ బుధవారం విచారించగా, సీపీఎం తరఫున న్యాయవాదులు ఎన్‌జీఆర్ ప్రసాద్, ఆర్.తిరుమూర్తి హాజరుకాగా, గురువారానికి కేసు వాయిదావేస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, ఈ అప్పీలు పిటిషన్ విచారణకు న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, ఎస్.సౌందర్, ఆర్.విజయకుమార్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు చేస్తూ ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ ఉత్తర్వులు జారీచేశారు.

పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరైన అన్నామలై

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ టీఆర్ బాలు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై గురువారం కోర్టుకు హాజరయ్యారు. అన్నామలై విడుదల చేసిన 'డీఎంకే ఫైల్స్' పేరుతో నేరారోపణల్లో, తనపై అసత్య వ్యాఖ్యలు చేశారంటూ డీఎంకే ఎంపీ టీఆర్ బాలు సైదాపేట కోర్టులో పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసు విచారణకు గురువారం అన్నామలై కోర్టుకు హాజరుకాగా, టీఆర్ బాలు హాజరుకాలేదని సమాచారం. దీంతో, ఈ కేసు విచారణ ఆగస్టు 28వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. కాగా, టీఆర్ బాలు విచారణకు హాజరుకాకపోవడంపై అన్నామలై తన ఎక్స్ పేజీలో... ఆయనకు కోర్టుకు గైర్హాజరవడం ఆనవాయితీగా మారిందని విమర్శించారు.

వరకట్న వేధింపుల కేసులో భర్త, అత్తకు 13యేళ్ళ జైలు

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మాంగాడు సమీపంలో వరకట్నం వేధింపుల కారణంగా 9 నెలల బిడ్డతో తల్లి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో భర్త, అత్తకు న్యాయస్థానం 13యేళ్ళ జైలుశిక్ష విధించింది. మాంగాడు సమపంలోని మొగలివాక్కం పెరుమాళ్‌కోవిల్ వీధికి చెందిన విజయ్‌కుమార్ (28) మహేశ్వరి (26) దంపతులకు 9 నెలల కుమారుడున్నాడు. మహేశ్వరిని అదరపు కట్నం కోసం విజయ్‌కుమార్, అతని తల్లి లక్ష్మి నిత్యం వేధిస్తునట్లు సమాచారం. భర్త, అత్త వేధింపులకు తాళలేక మహేశ్వరి 2014 మే 25న తన కుమారుడితో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విజయ్‌కుమార్, లక్ష్మిలను అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. కాంచీపురం జిల్లా క్రిమినల్ కోర్టులో సాగిన ఈ కేసు విచారణ బుధవారం ముగిసింది. దీనితో న్యాయమూర్తి విజయ్‌కుమార్, లక్ష్మిలకు 13యేళ్ళ జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

తరగతి గదిలో అసభ్య పదజాలం

● ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో అసభ్య పదజాలం వినియోగించిన ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. రామనాథపురం జిల్లా పరమకుడి ఎమనేసువరం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో అరుళ్‌రాజన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతను తరగతి గదిలో అసభ్య పదజాలం వినియోగించి మాట్లాడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై పలువురు విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలుపడంతో, వారు పాఠశాల హెచ్‌ఎం ధర్మరాజ్ దృష్టికి తీసుకువెళ్లారు.. ధర్మారాజ్ ఫిర్యాదు ఆధారంగా పరమకుడి మహిళా పోలీసులు విచారణ చేపట్టి, ఉపాధ్యాయుడు అరుళ్‌రాజన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై మద్యం బాటిల్‌తో దాడి

● నలుగురు విద్యార్థుల సస్పెన్షన్

పెరంబూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిపై మద్యం బాటిల్‌తో దాడిచేసిన వ్యవహారంలో నలుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. విరుదునగర్ జిల్లా తిరుత్తాంగల్ ప్రభుత్వ పాఠశాలలో మదురై జిల్లా తిరుమంగళంకు చెందిన షణ్ముగసుందరం (48) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం తరగతి గదికి ఆలస్యంగా వచ్చిన ఇద్దరు ప్లస్ టూ విద్యార్థులను బయట ఉండాలని షణ్ముగసుందరం ఆదేశించారు. అనంతరం పాఠశాల వరండా ప్రాంగణంలో ఉపాధ్యాయుడు, విద్యార్థుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆ సమయంలో ఓ విద్యార్థి తన సంచిలోని మద్యం బాటిల్‌తో ఉపాధ్యాయుడిపై దాడిచేయడంతో, ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. సహచర ఉపాధ్యాయులు ఆయనను తిరుమంగళం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం విరుదు నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు దాడి చేసిన ఇద్దరు విద్యార్థులను అరెస్ట్ చేశారు. అలాగే, దాడికి పాల్పడిన విద్యార్థులు, వారికి సహాయం చేసిన మరో ఇద్దరు విద్యార్థులకు తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది.

నీలగిరిలో కుండపోత

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో బుధవారం సాయంత్రం నుండి గురువారం వేకువజాము వరకు కుండపోతగా వర్షం కురిసింది. పెనుగాలులలకు చెట్లు విద్యుత్ స్తంభాలపై కూలిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఊటీ, కున్నూరు, గూడలూరు, కొత్తగిరి, పందలూరు తదితర ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. వెలింగ్టన్, ఒట్టుపట్టరై, అరువంగాడు, కొలకొంబై, కాట్టేరి తదితర ప్రాంతాల్లో గంటకు పైగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పందలూరు పరిసర ప్రాంతాలైన ఉప్పడి,పొన్ని, నెలాకోట్టై, పితర్‌కాడు, పాట్టవయల్, అంబలముల తదితర ప్రాంతాల్లో పెనుగాలులతో వర్షాలు కురిశాయి. దీని కారణంగా అయ్యన్‌కొల్లి నుండి కారకొల్లి వరకు రహదారిలో విత్యుత్ తీగెలు తెగి చెట్లపడ్డాయి. దీంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పలుచోట్ల రహదారుల్లో చెట్లు కూలిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌బోర్డు, అధికారులు, అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడి చేరుకుని చెట్లను తొలగించే పనులు చేపట్టారు.

దిండివనం సమీపంలో బయల్పడిన పురాతన విగ్రహాలు



జ్యేష్ఠాదేవి, విష్ణుమూర్తి విగ్రహాలు

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో వన్నిపేర్ గ్రామంలో చేపట్టిన తవ్వకాల్లో 8వ శతాబ్దం కాలంనాటి జ్యేష్ఠాదేవీ, విష్ణుమూర్తి విగ్రహాలు బయల్పడ్డాయి. మరుక్కాణం-పుదుచ్చేరి రహదారిలో ఉన్న వన్నిపేర్ గ్రామంలోని శివాలయం ప్రాంతంలో విల్లుపురానికి చెందిన పురావస్తుశాఖ పరిశోధకులు సెంగొట్టువన్ బృందం తవ్వకాలు జరిపింది. ఇందులో బయల్పడిన రెండు దేవతామూర్తుల విగ్రహాలను పరిశీలించిన అనంతరం సెంగొట్టువన్ మీడియాతో మాట్లాడుతూ, తమ బృందం జరిపిన తవ్వకాల్లో లభ్యమైన రెండున్నర అడుగుల జ్యేష్ఠాదేవి రాతి విగ్రహాన్ని ఆ ప్రాంతంలో నివసించిన ప్రజలు దుర్గాదేవిగా కొలిచారని అందువల్లే ఈ ప్రాంతాన్ని దుర్గామిట్ట అని పిలిచేవారని తెలిపారు. సుమారు 5 అడుగుల విష్ణుమూర్తి విగ్రహం, నాలుగు చేతులతో ఉందని, పైనున్న రెండు చేతుల్లో శంఖుచక్రాలు, కుడిచేతిలో అభయముద్ర, ఎడమచేతిలో గద ఉందన్నారు. ఇవి 8వ శతాబ్దం కాలంనాటివని భావిస్తున్నట్లు ఆయన వివరించారు.

రేషన్ దుకాణ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రన్ తదితరులు

తిరుత్తణి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని మార్కెట్ సొసైటీ పరిధిలో రేషన్ దుకాణ భవన నిర్మాణానికి తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ గురువారం ఉదయం భూమిపూజ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న రేషన్ దుకాణాన్ని బాగుచేయమని ప్రజల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎమ్మెల్యే చంద్రన్ రూ.14 లక్షలతో నూతన రేషన్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ఇందులో భాగంగా రూ.14 లక్షలతో రేషన్ దుకాణాల నిర్మాణం పనులకు భూమిపూజలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జి.రవీంద్ర, గ్రామీణ డెవెలెప్మెంట్ అధికారి అరుళ్, ఇంజనీర్లు సంజీవరాజ్, మోహన్, సునీల్‌కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

విడుదలకు ముందే పాజిటివ్ టాక్

● నేడు 'జన్మ నచ్చత్తిరం' విడుదల

తమన్ అక్షాన్ - మాల్వి మల్హోత్రా జంటగా నటించిన 'జన్మ నచ్చత్తిరం' విడుదలకు ముందే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుందని రోమియో పిక్చర్స్ అధినేత రాహుల్ హర్షం వ్యక్తం చేశారు.


'జన్మ నచ్చత్తిరం' ఓ దృశ్యం

ఈ చిత్ర ప్రివ్యూ షో సందర్భంగా రాహుల్ స్పందిస్తూ, 'సాధారణంగా మా సంస్థ డిస్ట్రిబ్యూషన్ చేసే సినిమాలు హిట్ అవుతాయన్న ప్రచారం కోలీవుడ్‌లో ఉంది.ఇపుడు ఈ మూవీని మేము రిలీజ్ చేయడం ఒక ప్లస్ పాయింట్. దర్శక నిర్మాతలు ఎంచుకున్న కథ, నటీనటుల ప్రదర్శన చాలా బావుంది. ముఖ్యంగా ప్రేక్షకులకు భయం కలిగించే సన్నివేశాలున్నాయని, వీటికి నేపథ్యసంగీతం కూడా తోడైంది. మూవీ చూస్తున్నంత సేపు ప్రేక్షకులను ఒక తెలియని రహస్య ప్రాంతానికి తీసుకెళ్ళినట్టుగా ఉంటుంది' అని పేర్కొన్నారు. అమోఘం స్టూడియోస్, వైట్‌ల్యాంప్ పిక్చర్స్ పతాకంపై కె.సుభాషిణి నిర్మించారు.

'రెడ్ ఫ్లవర్' మూవీ ఫ్యూచరిస్టిక్ బాహుబలి

● వైజీ మహేంద్రన్


ఆడియో రిలీజ్ దృశ్యం

శ్రీకాళికాంబాల్ పిక్చర్స్ పతాకంపై కె.మాణిక్యం నిర్మాణసారథ్యంలో విఘ్నేష్ హీరోగా రూపొందిన చిత్రం 'రెడ్ ఫ్లవర్' ఫ్యూచరిస్టిక్ 'బాహుబలి' మూవీ అని సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ పేర్కొన్నారు. తాజాగా నగరంలో జరిగిన రెడ్‌ఫ్లవర్ చిత్ర ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైజీ మహేంద్రన్ మాట్లాడుతూ.. 'ఈ సినిమా సక్సెస్ అయిందంటే దానికి కారణం దర్శకుడు ఆండ్రూ పాండ్యన్. భవిష్యత్‌లో జరిగే కథ కావడంతో ఈ సినిమాను తీయడం 'బాహుబలి' కంటే ఎక్కువ కష్టం. 'మిషన్ ఇంపాజిబుల్', 'మేట్రిక్స్' వంటి చిత్రాల తరహాలో ఉంటుందన్నారు. ఈ వేడుకల్లో నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్, సినీ దర్శకులు సూరజ్, తిరుమలై, పి.వాసు, ప్రముఖ నిర్మాత ఫైవ్‌స్టార్ కదిరేశన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఆండ్రూ పాండ్యన్ మాట్లాడుతూ, '2047లో మాల్కమ్ పన్ను చెల్లించని దేశాలపై యుద్ధం ప్రారంభించగా, నేతాజీ స్థాపించిన ఒక ఆర్గనైజేషనే రెడ్ ఫ్లవర్. ఈ యుద్ధాన్ని భారత్ ఎలా ఎదుర్కొంది అన్నదే ఈ చిత్ర కథ' అని వివరించారు. నటుడు విఘ్నేష్ మాట్లాడుతూ, 'గత 30 యేళ్ళుగా చిత్రపరిశ్రమలో ఉన్నాను. సినిమా అంటే అమితమైన ఇష్టం. అందుకే చాలా రోజుల తర్వాత మళ్ళీ నటించేందుకు వచ్చాను. కొన్ని సందర్భాల్లో నేను ఓడిపోవచ్చు. కానీ, నా ప్రయత్నం మాత్రం విఫలం కాదు' అన్నారు. హీరో విశాల్ మాట్లాడుతూ, 'కష్టాల్లో ఉన్న సినిమాను పరిరక్షించేందుకు అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం. నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం. ఈ భవనంలో జరిగే తొలి వివాహ వేడుక నాదే అవుతుంది' అన్నారు. ఇదిలా వుండగా రెడ్ ఫ్లవర్ చిత్రం ఆగస్టు 8న విడుదల కానుంది.

ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్

భారతీయ చలనచిత్రపరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందిన చియాన్ విక్రమ్ కొత్త చిత్రం ప్రారంభమైంది. '96', 'మెయ్యళగన్' వంటి హిట్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు ప్రేమ్ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. బడా నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ తన సొంత నిర్మాణ సంస్థ వేల్స్ ఇంటర్నేషనల్ ఫిలిమ్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'మెయ్యళగన్' చిత్రంలో బంధువులు, బంధుత్వాలు, భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన ప్రేమ్ కుమార్.. మరోమారు హార్ట్ టచ్చింగ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకురానున్నారు. ఈ కొత్త చిత్ర పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఇందులో దర్శక నిర్మాతలతో పాటు హీరో హీరోయిన్లు పాల్గొన్నారు.


ప్రేమ్ కుమార్, విక్రమ్, ఐసరి గణేష్ తదితరులు

'కాళిదాస్-2' టీజర్ రిలీజ్


'కాళిదాస్-2'లో ఓ దృశ్యం

ప్రముఖ నటుడు భరత్, నూతన నటుడు అజయ్ కార్తీక్ తొలిసారి కలిసి నటించిన 'కాళిదాస్-2' చిత్రం టీజర్‌ను ప్రముఖ హీరో రవి మోహన్, ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ తమతమ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో రిలీజ్ చేశారు. 2019లో సెంథిల్ భరత్ హీరోగా ఈ సినిమా తొలిభాగం రాగా, వాణిజ్యపరంగా, విమర్శనాత్మకంగా సక్సెస్ సాధించింది. ఇపుడు రెండో భాగాన్ని రూపొందించారు. ఇందులో భరత్, అజయ్ కార్తీక్, ప్రకాష్ రాజ్, సురేష్ మీనన్, అనంత్ నాగ్, భవానీ శ్రీ, అపర్ణతి, రాజా రవీందర్, డీఎం కార్తీక్, సింగం జయవేల్ తదితరులు నటించారు. ప్రముఖ నటి సంగీత ఈ చిత్రంలో ఓ ముఖ్యమైన పాత్ర ద్వారా కోలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా స్టోరీపై ఉన్న నమ్మకంతో ప్రముఖ పంపిణీదారుడు, నిర్మాత ఫైవ్ స్టార్ సెంథిల్ తన సొంత నిర్మాణ సంస్థ స్కై పిక్చర్స్ పతాకంపై నిర్మించారు.

ముక్తిని ప్రసాదించే


● శూరపద్మడు తపస్సు చేసిన 'మయూరాచలం'
● మూడు రూపాల్లో దర్శనమిచ్చే మురుగప్పెరుమాన్

మయిలమ్ ఆలయం

ఆధ్యాత్మికం

చుట్టూ వావిలి చెట్లతో, పచ్చటి వాతావరణంలో ఉన్న మయిలమ్ మురుగప్పెరుమాన్ పర్వతాలయం భక్తులకు మానసిక ప్రశాంతతతో పాటు, ముక్తిని ప్రసాదించే దివ్య క్షేత్రం. ఈ క్షేత్రాన్ని దర్శిస్తే సకల సౌభాగ్యాలతో పాటు, మోక్షం ప్రాప్తిస్తుందని శైవాగమ పండితులు చెబుతున్నారు. మయిలమ్ దివ్యక్షేత్రం విశేషాల సమాహారం నేటి ఆధ్యాత్మికంలో....

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


ఆలయరాజగోపురం విహంగవీక్షణం


ఆలయ మండపం

విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో ఉన్న ఈ ఆలయ క్షేత్రపాలకుడు మురుగప్పెరుమాన్ మహిమలను అరుణగిరినాథర్, శివప్రకాశ స్వామి, వైద్యనాథ దేశికర్, పన్రుట్టి మణిఅయ్యర్ తదితర శైవభక్త శిఖామణులు, పండితోత్తములు, మహాకవులు తమ కీర్తనల్లో, రచనల్లో, కవిత్వాలలో ఎలుగెత్తి చాటారు. ఈ ఆలయం ఓ చిన్న కొండపై అందమైన రాజగోపురంతో అలరారుతోంది. చుట్టూ పచ్చటి చెట్లతో ఉండటంతో దూరం నుండి చూసినప్పుడు నెమలి పురి విప్పినట్లు కనిపిస్తుంది. గోపురం నెమలి కొప్పులా శిఖరాగ్రంలో ఉంటుంది. ఆలయంతో పాటు ఈ పర్వతాన్ని కూడా భక్తులు అత్యంత పవిత్రమైనదిగానే పరిగణిస్తున్నారు.


పచ్చటి వావిలి వృక్షాల నడుమ ఆలయరాజగోపురం

స్థలపురాణం...

భీకరయుద్ధంలో మురుగప్పెరుమాన్ చేతిలో ఓటమిపాలైన శూరపద్మడు, స్వామివారి అనుగ్రహం కోసం ఈ క్షేత్రానికి వచ్చి, నెమలి రూప పర్వత రూపంలో కఠోర తపస్సు చేశాడు. అతడి తపస్సుకు మెచ్చి మురుగప్పెరుమాన్ ప్రత్యక్షమై వరం కోరుకోమనగా, శూరపద్మడు స్వామివారికి వాహనంగా సేవ చేసే భాగ్యం కల్పించమని, నెమలి ఆకారంలో తపస్సు చేసిన ఈ పర్వతానికి 'మయూరాచలం' అనే పేరుపెట్టి, ఇక్కడే స్వామివారు భక్తులను అనుగ్రహించాలని వేడుకున్నాడు. భవిష్యత్‌లో ఈ క్షేత్రం వద్ద బాలసిద్ధుడు అనే మహాపురుషుడు తపమాచరిస్తాడని, ఆ సమయంలో శూరపద్మడి కోరికలు నెరవేరుతాయని మురుగప్పెరుమాన్ ప్రకటించారు. అప్పటి వరకు పర్వతాకారంలోనే శూరపద్మడు ఇక్కడ స్వామివారిని ధ్యానిస్తూ గడిపాడు. ఆ తర్వాత బాలసిద్ధపురుషుడు ఈ క్షేత్రానికి విచ్చేసి, స్వామివారిని ఆరాధించి జీవసమాధి నొందారు. శూరపద్మడు కోరుకున్నట్లే ఈ పర్వతానికి 'మయూరాచలం' అనే పేరొచ్చింది. కాలగమనంలో ఆ పేరు కాస్త తమిళంలో 'మయిలమ్'గా రూపాంతరం చెందింది.


మూలవిరాట్టు

స్వామివారి ఊరేగింపు జరుగుతుంది. పంగుణి ఉత్తిరం వేడుకలు ఈ ఆలయంలో 12 రోజులపాటు బ్రహ్మోత్సవాల్లా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో స్వామివారు కల్యాణరూపుడై ప్రతి రోజూ మయూర, గజ, వృషభ, నాగ, భూత వాహనాలపై విహరిస్తారు. రెండో ఉత్సవమూర్తి వళ్ళి-దైవానై సమేతుడైన ముత్తుకుమారస్వామి. భరణి నక్షత్ర దినాల్లో ఈ స్వామివారిని ఊరేగిస్తారు. మాసిమఖం తీర్థవారి సందర్భంగా ఉత్సవమూర్తిని పుదుచ్చేరి సముద్రతీరం వరకూ ఆలయ సిబ్బంది తమ భుజాలపై మోసుకెళ్తారు. ఐదు రోజుల పాటు ఆ సముద్రతీరం వద్దే కొలువుదీరి పుదుచ్చేరి భక్తులను అనుగ్రహించిన మీదట ఆరోరోజు స్వక్షేత్రానికి తిరిగివస్తారు. మూడో ఉత్సవమూర్తి ఆరు ముఖాలు కలిగిన షణ్ముఖపెరుమాళ్. స్కంధషష్ఠి ఉత్సవాల్లో ఆరు రోజులపాటు సర్వాలంకరణ శోభితుడై ఊరేగుతారు. ఈ వేడుకలే కాకుండా చిత్తిరై వసంతోత్సవాలు, ఆణి నెలలో ఏడురోజులు లక్షార్చన వేడుకలు ఘనంగా జరుగుతాయి. స్వామివారికి చాలా ఇష్టమైన వావిలి చెట్లు మయిలమ్ పర్వతం అంతటా విరివిగా ఉన్నాయి. ప్రతిరోజూ పూజకు ఈ వావిలి ఆకులనే మాలగా మూలవర్లకు, ఉత్సవమూర్తులకు వేస్తారు. ఆ తర్వాతే పుష్పాలతో అలంకరిస్తారు. మూలవిరాట్టు కొలువైన గర్భాలయ మండపానికి బయట బ్రహ్మాండమైన వేలాయుధం, మయూరం ఉన్నాయి. ఈ ఆలయంలో మంగళవారాల్లో శాంతికాల పూజల సందర్భంలో వేలాయుధానికి అర్చన చేస్తారు. ఉత్సవమూర్తి మురుగప్పెరుమాన్ సమీపంలోనే ఆయన సైన్యాధ్యక్షుడైన వీరబాహు ఉత్సవమూర్తి ఉన్నారు.. మంగళవారం ఉదయం వీరబాహుకు కూడా క్షీరాభిషేకం, అర్చన జరిపితే త్వరగా వివాహాలు జరుగుతాయని చెబుతారు కనుకనే మంగళవారాల్లో పెళ్ళీడు యువతులు ఈ ఆలయానికి విచ్చేస్తుంటారు.


ఆలయవిశేషాలు..

సాధారణంగా సిద్ధపురుషులు జీవసమాధి అయిన ప్రాంతంలో భక్తులు కోరికలు తీరుతాయన్నది చరిత్ర. ఎవరికీ కట్టుబడని మురుగప్పెరుమాన్ వేల(శూలా)యుధం ఇక్కడి బాలసిద్ధపురుషుడి వశమైనట్లు శైవ పండితులు చెబుతారు. అందుకే మయిలమ్‌లో జరిగే స్కంధషష్ఠి వేడుకలలో శూర సంహారానికి బయలుదేరే మురుగప్పెరుమాన్ బాలసిద్ధపురుషుడి నుంచి వేలాయుధాన్ని స్వీకరించి వెళ్తుంటారు. ఆలయంలో బాలసిద్ధపురుషుడి తర్వాతే మూలవిరాట్టు దర్శనమిస్తారు. వళ్ళి, దైవానై సమేతుడైన స్వామివారు ఓ చేత వేలాయుధాన్ని, మరో చేత కోడిపుంజు పతాకాన్ని పట్టుకుని సర్వాలంకరణశోభితుడై భక్తులను దర్శనమిస్తున్నారు. సాధారణంగా మురుగప్పెరుమాన్ ఆలయాల్లో స్వామివారి వాహనమైన మయూరం దక్షిణదిశగా లేదా నేరుగా ఉంటుంది. అయితే ఈ ఆలయంలోని నెమలి ఉత్తరం వైపు ఉండటం విశేషం. శూరపద్మడు ఉత్తరదిశగానే తపస్సు చేసి మురుగప్పెరుమాన్‌కు వాహనంగా మారటం వల్ల ఈ ఆలయంలో నెమలి ఉత్తరం దిశవైపు చూస్తూ ఉంటుంది.

ఎలా వెళ్ళాలి?... : విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో ఉంది మయిలమ్. పుదుచ్చేరి, విల్లుపురం, దిండివనం నగరాల నుండి అరగంటకొకటి చొప్పున రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సుల్లో చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో కూట్టేరిపట్టు అనే స్టాపింగ్‌లో దిగాలి. అక్కడి నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మయిలమ్ ఆలయానికి టౌన్ బస్సులు, ఆటోలు అందుబాటులో ఉన్నాయి. కార్లు, బైకులో కొండమీదికి వెళ్ళటానికి అనువైన రహదారి కూడా ఉంది. ప్రతిరోజూ ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8.30 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ముగ్గురు ఉత్సవర్లు...

మయిలమ్ ఆలయంలో మురుగప్పెరుమాన్ మూడు విధాలైన ఉత్సవమూర్తులుగా పూజలందుకుంటున్నారు. వీరిలో ప్రధాన ఉత్సవమూర్తి వళ్ళి- దైవానై సమేత బాలసుబ్రహ్మణ్యస్వామి. పగటిపూట రజత కవచం ధరించి, సాయంత్రం పూజల తరువాత స్వర్ణకవచంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతినెలా కృత్తిక దినాన, పంగుణి ఉత్సవాల సందర్భంగా కొండ చుట్టూ ఉన్న మూడో ప్రాకారంలో



కొండపైకి వెళ్లేందుకు మెట్లదారి - ప్రవేశద్వారం

పగరియా జేబీఎన్ కాంక్లేవ్‌కు విశేష స్పందన


కాంక్లేవ్ ప్రారంభోత్సవ దృశ్యం

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఇటీవల జరిగిన పగరియా జేబీఎన్ బిజినెస్ కాంక్లేవ్‌కు విశేష స్పందన వచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు. 'నెట్‌వర్క్ ఈజ్ నెట్‌వర్త్' అనే దార్శనికతతో ఆకాష్‌కుమార్, అంకిత్ సిరోయా కునాల్ జైన్, రాజేష్ చందన్, శ్రేజస్ కొఠారి మార్గదర్శకత్వంతో ఈ బిజినెస్ కాంక్లేవ్ జరిగింది. ఈ వేడుకల్లో జితో అపెక్స్ ప్రముఖులు డీకే జైన్ జితేంద్ర భండారి, ఏ టూ బీ ఎండీ కేజీ శ్రీనివాస రాజా, పాల్సన్స్ గ్రూప్ ఛైర్మన్ ఎస్ఆర్ శ్యాంపాల్ తదితరులు పాల్గొన్నారు. లగ్జరీ ఆభరణాలు, ఫ్యాషన్, గృహాలంకరణ, ఫర్నిచర్, హార్డ్‌వేర్, గిఫ్టింగ్ తదితర విభాగాలకు చెందిన 60కి పైగా బ్రాండ్లతో ఈ కాంక్లేవ్ వేదికగా నిలిచింది. రిపబ్లిక్ ఆఫ్ మలావి కాన్సుల్ వినోద్ శర్మ, రిపబ్లిక్ ఆఫ్ సీషెల్స్ ఎం.శేషసాయి, మయన్మాల్ కాన్సుల్ ప్రొఫెసర్ రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

సర్ఫేస్ అండ్ కోటింగ్ ఎక్స్‌పో ప్రారంభం



ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో ప్రముఖులు

అడయార్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 'సర్ఫేస్ అండ్ కోటింగ్ ఎక్స్‌పో 2025' నగరంలో గురువారం ప్రారంభమైంది. అతిపెద్ద ఎక్స్‌క్లూజివ్ ఈవెంట్‌గా గుర్తింపు పొందిన సర్ఫేస్ ఇంజనీరింగ్, ప్రిపరేషన్, కోటింగ్, ఫినిషింగ్, కరోసన్ ప్రొటెక్షన్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను హోమి బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌బీఎన్ఐ) వైస్ చాన్సలర్, సీఐఐ సదరన్ రీజియన్ ప్రెసిండెంట్, డిప్యూటి ఛైర్మన్ పి.రవీంద్రన్, సీఐఐ తమిళనాడు స్టేట్ కౌన్సిల్, గ్లాస్ గ్రూపు సెయింట్ గోబిన్ ఇండియా ఏఆర్ ఉన్నికృష్ణన్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో సర్ఫేస్ కోటింగ్ పరిశ్రమకు చెందిన వాటాదారులు, తయారీదారుల, పంపిణీదారులు, సొల్యూషన్ ప్రొవైడర్లు, వ్యాపారులు, విధాన రూపకర్తలు, నెట్‌వర్క్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. 300కుపైగా ఎగ్జిబిటర్లు ఈ ఎక్స్‌పోలో తమ స్టాళ్లను ఏర్పాటుచేసి తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.

'సూపర్ చెన్నై' వెబ్‌సైట్ ఆవిష్కరణ


ఆవిష్కరణలో నిర్వాహకులు, అతిథులు

అడయార్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కథనాలు, నగర నవీకరణ వంటి వాటితో 'సూపర్ చెన్నై' పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ ఆవిష్కృతమైంది. ఆ సంస్థ ఎండీ రంజిత్ డి రాథోడ్, పాయింట్‌కాస్ట్ బ్రాండ్ నిర్వాహకులు ఆదిత్య స్వామినాథన్ తదితరులు దీనిని గురువారం చెన్నైలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంజిత్ మీడియాతో మాట్లాడుతూ.. సిలికాన్ వ్యాలీకి చెందిన టెక్ కంపెనీ భాగస్వామ్యంతో దీనిని రూపొందించినట్లు తెలిపారు. నగరానికి హృదయ స్పందన అందించే తమ మార్గం ద్వారా ప్రజలు ఎక్కడ వున్నా ప్రత్యేక అనుభూతి పొందుతారన్నారు. ఇది చెన్నై పౌరుల నిజసమయంలో మాట్లాడుతుందని వ్యాఖ్యానించారు..


రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ అయిన సందర్భంగా గురువారం సాయంత్రం చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్

ఒక్కో శిల్పం ఒక్కో చారిత్రక ఘట్టానికి ప్రతీక

● లఘుచిత్ర దర్శకుడు శివకుమార్

అడయార్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మహాబలిపురంలోని ఒక్కొక్క శిల్పం ఒక్కో చారిత్రక ఘట్టానికి ప్రతీక అని ప్రముఖ లఘుచిత్ర దర్శకుడు శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక పట్టాభిరాంలోని డీఆర్‌బీసీసీసీ హిందూ కాలేజీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సెల్ అధ్వర్యంలో భారతీయ శిల్పకళా వైభవంపై గురువారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో శివకుమార్ మాట్లాడుతూ, దేశంలోని శిల్పకళ వైభవం ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. అది కూడా 6వ శతాబ్దానికి చెందిన పల్లవరాజుల్లో పేరొందిన నరసింహవర్మ పల్లవరాజు చెక్కించిన మహాబలిపురంలో ఉన్న ఒక్కొక్క శిల్పం గుర్తించి పరిశోధిస్తే అసలైన దేశ చారిత్రక ఏంటో తెలుస్తుందన్నారు. పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానంలో ఏఐ ద్వారా ఈ శిల్పాల్లో ఉన్న అసలు చరిత్రను డీకోడ్ చేస్తే భారతదేశ చరిత్రను తిరగరాయాల్సి ఉంటుందన్నారు. ఆ దిశగా తనతో పాటు ఆసక్తి ఉన్న విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహాబలిపురం శిల్పకళా వైభవాన్ని పవర్ పాయింట్‌లో చూపుతూ చేసిన ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకుంది. భారతీయ శిల్పకళా వైభవం అనే అంశంపై ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సెల్ తరఫున నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కల్విక్కరసి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఐకేఎస్ సెల్ సమన్వయకర్త, ఆర్థిక శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ వి.సుజాత ఐకేఎస్ విభాగం సభ్యురాలు, తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ తుమ్మలపూడి కల్పన, విస్కాం అధ్యక్షుడు డాక్టర్ రఘురామ్, ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారులు, కలైమామణి మాధవపెద్ది మూర్తి తదితరులు పాల్గొన్నారు.


శివకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

24న అయ్యనార్ ఆలయంలో ఆడి అమావాస్య ఉత్సవం

● ప్రైవేటు వాహనాలకు అనుమతి లేదు

ప్యారీస్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కారయార్ ప్రాంతంలో ని సొరిముత్తు అయ్యనార్ ఆలయంలో ఈ నెల 24న నిర్వహించనున్న ఆడి అమావాస్య ఉత్సవాలకు భక్తులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లొద్దని జిల్లా యంత్రాంగం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కొండల మధ్య ప్రకృతి సౌందర్యం, జలపాతాలతో కూడిన ఈ ఆలయంలో ఆడి మాసం సందర్భంగా 24, 25వ తేదీల్లో తీర్థవారీ, అగ్నిగుండ ప్రవేశం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 26వ తేదీ సింగంపట్టి జమీందారు స్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మూడు రోజులు దళవాయి మాడస్వామి, సంగిలిపుత్తూరు, ఇసైక్కియమ్మన్, భట్టవరాయర్, పరివార దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ, దీపారాధన చేసేందుకు హిందూ దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఆర్.సుకుమార్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, సొరిముత్తు అయ్యనార్ ఆలయంలో జరిగే ఆడి అమావాస్య ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు నిషేధం విధించినట్టు తెలిపారు. అడవీ మార్గంగుండా పయనించి కొండపై నున్న ఆలయానికి భక్తులు చేరుకునేందుకు అటవీ శాఖ తాత్కాలికంగా అనుమతులిచ్చిందని, వన్యమృగాల బారిన పడకుండా భక్తులు సురక్షితంగా రావాలన్న ఉద్దేశంతో, వాహనాల రద్దీ నియంత్రించేందుకు ఈ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.


సొరిముత్తు అయ్యనార్ ఆలయం


త్యాగుల దినం సందర్భంగా గిండి గాంధీమండపం వద్ద సమరయోధులు ఆర్యా అలియాస్ భాష్యం, సెన్బగరామన్, శంకరలింగనార్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దామో అన్బరసన్, మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యే ఏఎంవీ ప్రభాకర్‌రాజా తదితరులు

టీటీడీకి మరో 30 ఏళ్లు ఎల్పీజీ

● ఐఓసీఎల్ స్టోరేజ్ కేంద్రానికి భూమిపూజ

తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): టీటీడీకి మరో 30 ఏళ్లపాటూ ఎల్పీజీ సరఫరా చేసేలా ఐఓసీఎల్ సంస్థతో ఒప్పందం కుదిరినట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని ఔటర్ రింగురోడ్డులో 45 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గ్యాస్ స్టోరేజ్ కేంద్ర నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ప్రస్తుతం నందకం సమీపంలో ఉన్న ఐఓసీఎల్ గ్యాస్ ప్లాంట్‌ను భద్రత కారణాలతో ఇక్కడికి




మారుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రూ.8.13 కోట్ల వ్యయంతో 1.86 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను టీటీడీ-ఐఓసీఎల్ సంయుక్తంగా ఆరు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. ఈ గ్యాస్‌ను లడ్డూప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించనున్నట్టు తెలిపారు. కాగా తిరుమల డంపింగ్ యార్డు వద్ద రూ.12.05 కోట్ల వ్యయంతో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని ఐఓసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ప్రతిరోజు వచ్చే 55 టన్నుల తడి వ్యర్థాల్లో 40 టన్నులు ఐఓసీఎల్ ప్లాంట్‌కు తరలించి రోజుకు వెయ్యి కేజీల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘హరిహర వీరమల్లు’ విజయం కోసం..

తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): ‘మా హీరో పవన్‌కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లు ఘన విజయం సాధించాలని స్వామిని కోరుకున్నా’ అని నిర్మాత డీవీవీ దానయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఈనెల 24వ తేదీన ‘హరిహర వీరమల్లు’ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. కాగా, సెప్టెంబరు 25న తమ ‘ఓజీ’ చిత్రం కూడా విడుదలవుతుందని చెప్పారు.


నిర్మాత డీవీవీ దానయ్య

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాకా వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.66 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,104

తలనీలాలు సమర్పించినవారు: 31,896

పారదర్శకంగా ‘సహకారం’



●పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ లావాదేవీలు ● చేతిరాత అక్రమాలకు ప్రభుత్వం చెక్

● మొండి బకాయిల వసూలుకు చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 17(ఆంధ్ర జ్యోతి): గాడి తప్పిన సహకార వ్యవస్థ ఇప్పుడిప్పుడే చక్కబడుతోంది. కార్యకలాపాలన్నీ పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రికార్డుల తారుమారుతో అక్రమాలకు పాల్పడే వైనాలకు తెర దించుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పీఏసీఎస్) భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. భూములు లేకున్నా పలువురిని సభ్యులుగా చేర్పించేశారు. బోగస్ పత్రాలతో కొందరు నాయకులు ఏకంగా రుణాలు కొట్టేశారని సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పీఏసీఎస్‌ల ప్రక్షాళనకు పూనుకుంది. తొలుత పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణకు నడుం బిగించింది. ఉమ్మడి జిల్లాలోని 75 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయింది. రెండు నెలల క్రితం వరకూ సొసైటీల కార్యకలాపాలన్నీ మాన్యువల్‌గా జరిగేవి. చేతిరాతలతో కొన్నిచోట్ల రికార్డులను తారుమారు చేసేవారనే విమర్శలుండేవి. ఇప్పుడీ సంఘాల లావాదేవీలను ఆన్‌లైన్ చేయడంలో అక్రమాలకు కళ్లెం పడినట్లేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకంగా సేవలందుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 21పైగా పీఏసీఎస్‌లకు ప్రభుత్వం ఛైర్మన్లు, సభ్యులను నియమించింది.

వారి ఆచూకీ ఎక్కడ?

పీఏసీఎస్‌ల్లో రైతులకు ఈకేవైసీ చేయించే ప్రక్రియ ఐదు నెలలుగా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని 75 పీఏసీఎస్ పరిధిలో 4.60లక్షలమందికి సభ్యత్వముంది. ఇందులో 2.96లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేయించుకున్నారు. మిగిలిన వారి ఆచూకీ తెలియడంలేదు. సభ్యత్వమున్నవారు ఈకేవైసీ చేయించుకోకపోవడంలో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇందులో కొంతమంది చనిపోయినవారూ ఉన్నారు. రుణాలు తీసుకుని చెల్లించని స్థానికేతరులూ వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా 2019 నాటికి రూ. 1100 కోట్ల మేర రుణాలు పంపిణీ చేయగా ఈయేడాది మార్చి నాటికి అది 2,034కోట్లకు చేరింది. గత ప్రభుత్వ హయాంలో రూ.92కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

మొండి బకాయిలు వసూలు చేస్తాం



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో మొండి బకాయిల వసూలుకు త్వరగా చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది చివరినాటికి 50 శాతం మేర పెండింగ్ బకాయిలను రాబడతాం. ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల పరిధిలో ఇప్పటికీ ఈకేవైసీ చేయించుకోని వారిని గుర్తించే పని మొదలు పెట్టాం. రెండు నెలల్లో ఈకేవైసీ పూర్తి చేస్తాం.

\- శంకర్‌బాబు, సీఈవో, జిల్లా సహకార కేంద్రబ్యాంకు





లక్ష్మీపురం సర్కిల్ వద్ద చేరిన వర్షపు నీటిలో ఆగిన ఆటోను నెట్టుతూ..

తిరుపతిలో జోరు వాన

తిరుపతిలో గురువారం రాత్రి జోరు వాన కురిసింది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నీళ్లు చేరడంతో పోలీసులు సూచనలిచ్చి పంపారు. లక్ష్మీపురం సర్కిల్‌లో చేరిన నీటితో ద్విచక్ర వాహనదారులు, ఆటోల వాళ్లు ఇబ్బంది పడ్డారు. గరుడవారధి నుంచి నీళ్లు రోడ్డుపై ఉధ్రుతంగా దూకాయి.

\- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

రాజన్న ఫౌండేషన్‌కు ‘సీఎస్ఆర్ టైమ్స్’ అవార్డు

● ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీ చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి/రేణిగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అమరరాజా కంపెనీ సౌజన్యంతో నడుస్తున్న రాజన్న ఫౌండేషన్‌కు ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ టైమ్స్-2025 అవార్డు దక్కింది. గురువారం ఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్లో ప్రముఖ సీఎస్ఆర్ మార్కెటింగ్, బ్రాండ్ హానాక్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ సీఎస్ఆర్-2025 అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ అవార్డును



కేంద్ర మంత్రి గడ్కరీ నుంచి అవార్డు అందుకుంటున్న రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్

అందుకున్నారు. గ్రామీణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి విభాగంలో రాజన్న ఫౌండేషన్‌కు ఈ అవార్డు దక్కింది. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తన తండ్రి, దివంగత మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్‌నాయుడు పేరిట ఏర్పాటు చేసిన రాజన్న ఫౌండేషన్ గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ రంగంలో నీటి సంరక్షణ కోసం చెక్ డ్యామ్‌లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు వంటివి కల్పించడంతో పాటు పశువైద్యం తదితర సేవలందిస్తూ గ్రామీణ ప్రజలకు మెరుగైన జీవనోపాధి అవకాశాలను ఫౌండేషన్ అందిస్తోంది. ఈ సేవలకు గుర్తింపుగా సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి రంగంలో తమ ఫౌండేషన్ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇకమీదట కూడా సేవలను కొనసాగిస్తామన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన అందరికీ అభినందలు తెలిపారు. అమరరాజా సంస్థల ఛైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ సానుకూల సామాజిక మార్పునకు కృషి చేయడంలో తమ ఫౌండేషన్ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో తమ ఫౌండేషన్ ద్వారా ఇతర రంగాల్లోనూ విశిష్ట సేవలు అందిస్తామన్నారు.

రాజకీయాల్లో ఉన్నవారికి స్వామి దర్శనం అవసరం

● ఆర్కే రోజా

తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): ‘స్వామిని దర్శించుకుంటే పాజిటివ్ ఫీల్ వస్తుంది. భగవంతుడిని దర్శించుకోవడం రాజకీయాల్లో ఉన్నవారికి చాలా ముఖ్యం. మళ్లీ కొత్త శక్తితో ప్రజల్లోకి వెళతాం.’ అని మాజీ మంత్రి ఆర్కే. రోజా అన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న అనంతరం ఆలయం బయట మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్య చేశారు. కాగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

శ్రీవారి భక్తులకు శుభవార్త

● తిరుమల బస్సుల్లో డిజిటల్ పేమెంట్


డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ తీసుకున్న భక్తుడు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ శ్రీవారి భక్తులకు శుభవార్త తెలిపింది. తిరుమల-తిరుపతి మధ్య తిరిగే ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ విధానాన్ని గురువారం ప్రవేశపెట్టింది. మిగతా బస్సుల్లో ఈ విధానం అమల్లో ఉన్నా రిటర్న్ టిక్కెట్స్ జారీ మూలాన ఇప్పటివరకు తిరుమల బస్సుల్లో డిజిటల్ పేమెంట్స్ అమలు కాలేదు. దీంతో అటు భక్తులకు, ఇటు కండక్టర్లకు సమస్యలు ఎదురయ్యేవి. పదేపదే ఫిర్యాదులు వస్తుండడంతో ప్రజారవాణాధికారి జగదీష్ డిజిటల్ పేమెంట్స్‌కు అనుమతి ఇవ్వాలని ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. రెండు రోజుల క్రితం అనుమతి రావడంతో ప్రస్తుతం విష్ణునివాసం, ఏడుకొండలు బస్టాండు, కపిలతీర్థం, శ్రీనివాసం, బాలాజీ బస్టాండులలో ప్రవేశపెట్టారు. త్వరలోనే తిరుమలలో అందుబాటులోకి తేనున్నారు.

విజిలెన్సు ఎస్పీకి ఐపీఎస్ కేడర్ ఖరారు


కరీముల్లా షరీఫ్

తిరుపతి(నేరవిభాగం), జూలై 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ(నాన్ కేడర్ ఎస్పీ) కరీముల్లా షరీఫ్‌కు ప్రభుత్వం ఐపీఎస్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన 2011లో పోలీసు శాఖలో తొలిసారిగా డీఎస్పీ హోదాలో అనంతపురం జిల్లా కదిరిలో పనిచేశారు. 2013 మేలో హైదరాబాదులో పోలీసు శిక్షణకు వెళ్లారు. అనంతరం ఐదు నెలల పాటు వెయిటింగ్‌లో ఉండిపోయారు. 2014 జనవరిలో ఏలూరు విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు విభాగంలో డీఎస్పీగా పనిచేసి.. మళ్లీ ఏడాది పాటు వెయిటింగ్‌లో ఉండి, కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. 2016లో తిరుపతి సీఐడీకి బదిలీపై వచ్చారు. మళ్లీ కొంత కాలం వెయిటింగ్‌లో ఉండిపోయారు. ఆయన పనితీరును గుర్తించి ప్రభుత్వం అనంతపురం జిల్లా పెనుకొండ డీఎస్పీగా నియమించింది. అక్కడ పనిచేస్తున్నప్పుడే కరీముల్లా షరీఫ్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించగా, ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ అయ్యారు. అక్కడ రెండేళ్ల పాటు పనిచేశాక 2020 మేలో సెబ్‌కు గుంటూరుకు పోస్టింగ్ ఇస్తూ అక్కడ నుంచి ఏలూరుకు అటాచ్‌మెంటు ఇచ్చారు. 2020 అక్టోబరులో విజయవాడ ఇంటెలిజెన్సు విభాగానికి బదిలీ అయ్యారు. 2023లో నాన్ కేడర్ ఎస్పీగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఆ హోదాలో తొలిసారిగా విజయవాడ ప్రాంతీయ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటుకు బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు విభాగానికి నియమించారు. ఈయన హయాంలోనే టీటీడీ ఇంజనీరింగ్‌తో పాటు వివిధ విభాగాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తనదైన శైలిలో విచారణ కొనసాగించి డీజీకి నివేదిక పంపారు. ఇప్పటికే తుడాలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వానికి విచారణ నివేదిక అందించారు. మరిన్ని పథకాల్లో అవినీతికి సంబంధించి ప్రభుత్వాదేశాలతో విచారణ జరుపుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పనిచేస్తున్న 11 మంది నాన్ కేడర్ ఎస్పీలకు ప్రభుత్వం ఐపీఎస్ కేడర్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కరీముల్లా షరీఫ్ కూడా ఉన్నారు. తన పనితీరుతో ఈయన డీజీ కమండేషన్ అవార్డులు మూడు.. 2018లో ఏ- కేటగిరి కింద ఏబీసీడీ అవార్డులు.. 2024లో పోలీసు సేవా పతకం అందుకున్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

\- నిందితుడి అరెస్టు -


స్వాధీనం చేసుకున్న గంజాయి

తిరుపతి(నేరవిభాగం), జూలై 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీసులు గురువారం ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామర్రు మండలం ఎర్రచేను గ్రామానికి చెందిన కదంబూరు రమేష్ కొంత కాలంగా ఒడిశా నుంచి గంజాయి తెప్పించి తిరుపతి కేంద్రంగా విక్రయాలు చేస్తున్నాడు. ఇక్కడి నుంచి చెన్నైకి చెందిన స్మగ్లర్లకు చేరవేస్తున్నాడు. గురువారం ఒడిశాకు చెందిన గోపాల్ రమేష్‌కు ఆరు కిలోల గంజాయి అప్పగించి, చెన్నైలోని అభికి చేర్చాలని కోరాడు. రమేష్ గంజాయి తీసుకుని చింతలచేను వద్దనున్న సామవాయి మార్గంలో నడచి వెళుతుండగా ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ హేమాద్రి తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అతని నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన గోపాల్, చెన్నైకు చెందిన అభిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ చెప్పారు.

బాలుర గృహాన్ని సందర్శించిన గ్రాండ్ మాస్టర్ అభిజిత్


జ్ఞాపికను అందుకుంటున్న హోం సూపరింటెండెంట్ వీరయ్య

తిరుపతి(క్రీడలు), జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రాండ్ మాస్టర్ అభిజిత్‌కుంటే గురువారం సాయంత్రం మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. బాలురను, బాలికలను పలకరిస్తూ చదరంగంలో మరింత రాణించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ఫస్ట్ ఏసియన్ ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన బాలుర జట్టుకు(చరణ్, దుర్గ, శ్రీనివాసులు, సునీల్, శ్యామ్), బాలికల జట్టు(భవానీ, రాణి, వేదశ్రీ, సంజన, హర్షిత)కు, హోం సూపరింటెండెంట్ వీరయ్యకు ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేష్‌రంజన్‌దాస్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఓసీఎల్ ప్రతినిధి తిమ్మప్ప, హోం సూపరింటెండెంట్స్ కాసిందొర, సునీత, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

నోటీసులిస్తే పరిష్కారమైనట్టేనా!

●ఆక్రమణలపై అధికారుల తీరిది ●విస్తుపోతున్న ఫిర్యాదుదారుడు

చంద్రగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): భూమి ఆక్రమణపై తానిచ్చిన ఫిర్యాదు పరిష్కారమైనట్లు తప్పుడు సమాచారం రావడంతో ఓ వ్యక్తి అవాక్కయ్యాడు. వివరాలిలా ... గత వైసీపీ ప్రభుత్వంలో ఏ.రంగంపేటలో నాగపట్ల రెవెన్యూ లెక్కదాఖల్లో సర్వే నెంబర్ 80-ఏలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారు. అందులో చిన్న చిన్న రేకుల షెడ్లనూ నిర్మించేశారు. వీటిలో విద్యుత్ సర్వీసులు మంజూరయ్యాయి. పంచాయతీ పన్నుల రికార్డులోనూ ఈ నిర్మాణాలు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు పైలెట్ ప్రాజెక్టు కింద స్వర్ణ నారావారి పల్లె క్లస్టర్ పరిధిలోకి ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలను చేర్చారు. ఇదే అదనుగా వైసీపీ నాయకులు తమ పలుకుబడితో అక్రమ రేకుల షెడ్లకు ఉచిత సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొన్నారు. ఈ అక్రమ వ్యవహారంపై ఇటీవల టీడీపీ కార్యకర్త ఒకరు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలకు ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో విద్యుత్ సర్వీసులు తొలగించాలని స్థానిక రెవెన్యూ అధికారులు , ఇంటి పన్నులు రద్దు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులు పరస్పరం నోటీసులు పంపుకొన్నారు. ఫిర్యాదుదారుడికి నోటీసు ఇస్తున్నట్లు సంతకం తీసుకున్నారు. ఇది జరిగిన కొద్ది సేపటికే అక్రమ నిర్మాణాల సమస్య పరిష్కారమైనట్లు ఫోనుకు మెసేజు రావడంతో ఫిర్యాదుదారుడు విస్తుపోయాడు. ్ర మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు మరోమారు ఫిర్యాదు చేయనున్నట్లు సదరు కార్యకర్త తెలిపారు.


కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

వాయిదాలకు హాజరుకాని ‘ఎర్ర’ స్మగ్లర్

● జామీనిచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు, జరిమానా

తిరుపతి(నేరవిభాగం)జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో కండిషన్ బెయిల్‌పై బయటకు వచ్చిన స్మగ్లర్ తొలినుంచీ వాయిదాలకు హాజరు కాలేదు. దీంతో జామీను ఇచ్చిక వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ ఎర్రచందనం జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. తొమ్మిదేళ్ల క్రితం ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ కర్ణాటకకు చెందిన ఆసీఫ్ ఆలీషేక్ అరెస్ట్ అయ్యాడు. పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అతను బెయిలు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. న్యాయమూర్తి విధించిన షరతులపై రేణిగుంటకు చెందిన వెంకటరమణ జామీను ఇచ్చారు. తొలి నుంచీ నిందితుడు కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో జామీను ఇచ్చిన వెంకటరమణకు న్యాయమూర్తి ఆరు నెలల పాటు జైలుశిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రచందనం కేసుల్లో నిందితులకు జామీను ఇచ్చి జైలు పాలు కావద్దని విజ్ఞప్తి చేశారు.

దీర్ఘకాలిక సెలవులోని టీచరుకు నోటీసులు

తిరుపతి(విద్య),జూలై17(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ముందస్తు అనుమతిలేకుండా దీర్ఘకాలంగా సెలవుపై ఉన్న శ్రీకాళహస్తి మండలానికి చెందిన వ్యాయామ టీచర్ ఎ.బాలకృష్ణకు గురువారం డీఈవో కేవీఎస్ కుమార్ నోటీసులు జారీ చేశారు. 2023జనవరి 24నుంచి ఈ ఏడాది జూలై 15వరకూ ముందస్తు అనుమతి పొందకుండా పాఠశాల విధులకు గైర్హాజరైనందున డీఈవో కార్యాలయం ద్వారా విధులకు హాజరుకావాలని రిజిస్టర్డ్ పోస్టు ద్వారా తాఖీదుని జారీ చేశామన్నారు.దీనికి బాలకృష్ణ నుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. రానున్న మూడురోజుల్లో శ్రీకాళహస్తి ఎంఈవో కార్యాలయంలో సంప్రదించి ఉత్తర్వులకు తన సంజాయిషి సమర్పించాలని,లేనిపక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల నుంచి శాశ్వతంగా తొలగించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

నగరిలో రాజకీయ రగడ

● ఇసుక రవాణా కేసులో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లకు రిమాండ్

● అధికార, ప్రతిపక్షాల నడుమ మాటలయుద్ధం

పుత్తూరు/నగరి,జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో వారం రోజులుగా రాజకీయం వేడెక్కింది.తమిళనాడుకు ఇసుక తరలిస్తున్నారంటూ అధికార, ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలతో వాతావరణాన్ని వేడెక్కించాయి.ఈ నేపథ్యంలో స్టోన్ డస్ట్ ముసుగులో తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా చేసిన కేసుకు సంబందించి ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లను అరెస్టు చేసినట్లు నగరి సీఐ విక్రమ్ గురువారం తెలిపారు.కౌన్సిలర్ బీడీ భాస్కర్‌ను పోలీసులు పట్టుకోగా మరో కౌన్సిలర్ బిలాల్ తానే లొంగిపోయారని సీఐ తెలిపారు.వీరిద్దరిని పుత్తూరు సబ్ కోర్టులో హాజరుపరచగా జడ్జి జూలై 31 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.రెండ్రోజుల క్రితం ఇదే కేసులో చెన్నైకి చెందిన భరత్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.అతడిచ్చిన సమాచారంతోనే వీరిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. పుత్తూరు కోర్టులో కౌన్సిలర్లను హాజరుపరిచిన విషయం తెలిసి మాజీ మంత్రి రోజా అక్కడకు చేరుకున్నారు.టీడీపీ నాయకుల ఇసుక అక్రమ రవాణాను సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకే వైసీపీ కౌన్సిలర్లను వేధిస్తున్నారని ఆరోపించారు.


పుత్తూరు సబ్‌కోర్టు వద్ద అనుచరులతో రోజా

ఎమ్మెల్యేపై రోజా ఫిర్యాదు

మహిళ అని కూడా చూడకుండా మీడియా ముందు తనను అసభ్యపదజాలంతో దూషించిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై కేసు నమోదు చేయాలని నగరి పోలీసులకు మాజీ మంత్రి రోజా గురువారం ఫిర్యాదు చేశారు.ఇసుక,బియ్యం స్మగ్లింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో నిజాలను ఎత్తి చూపితే టీడీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బియ్యం స్మగ్లింగ్‌లో దొరికిన అమృతరాజ్ నాడార్ ఎమ్మెల్యే అనుచరుడేనన్నారు.రూ.2000 ఇస్తే ఏ పనైనా చేస్తుందంటూ మార్కెట్లో మాటవున్న ఆమె నేడు రెండువేలకోట్లకు వారసురాలు ఎలా అయిందంటూ ఎమ్మెల్యే తనను కించపరిచేలా మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సీఐని రోజా కోరారు.

తప్పులు మీరు చేసి మాపై నెడతారా?

● రోజా వ్యాఖ్యలపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పుత్తూరు అర్బన్/నగరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తప్పు చేస్తే తప్పక శిక్షింపబడాలని, అది ఎవరైనా.. ఎంతటి వారినైనా ఉపేక్షించే పరిస్థితి లేదని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.వైసీపీ కౌన్సిలర్లపై ఇసుక అక్రమ రవాణా కేసు నమోదు నేపథ్యంలో మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. తాను తప్పు చేస్తూ ఇతరులను దొంగ అనడం రోజాకు అలవాటుగా మారిందన్నారు. నగరి నియోజకవర్గంలో ఇసుక, బియ్యం స్మగ్లింగ్‌తో రోజాతో పాటు ఆమె అన్నలకు, భర్తకు సంబంధం లేదని కాణిపాకం వచ్చి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.రూ.12 వేల అద్దె ఇంటినుంచి నేడు ఊరికో ఇంటిని నిర్మించుకునే స్థాయికి ఆమె ఎదిగిందని ఆరోపించారు.నగరిలో ఇటీవల పట్టుబడ్డ ఏడు ఇసుక టిప్పర్లు వైసీపీ కౌన్సిలర్లవేనని, వాటిని పట్టించింది తామేనని, ఆ విషయాన్ని రోజా గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేగా గెలిచాక పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, ప్రతి గ్రామంలో తిరిగానని,ఆ విషయం ఏడాదికాలంగా దినపత్రికలు పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. అనవసరంగా నియోజకవర్గంలో కన్పించడం లేదని మాట్లాడడం సబబు కాదన్నారు.